క్లుప్తంగా

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

నవీపేట: గణేశ్ నిమజ్జన ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై యాదగిరిగౌడ్ సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దూర ప్రాంతాల నుంచి బాసర గోదావరి నదికి నిమజ్జనానికి వెళ్లే గణేశ్ రథాలకు సహకరించాలని కోరారు. ఎంపీపీ సంగెం శ్రీనివాస్, సర్పంచ్ ఆసోల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మక్కలు కొనుగోలు చేయాలి

బాల్కొండ: రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా ఈ సీజన్‌లో మక్కలు కొనుగోలు చేయాలని ఐకేపీ ఎస్‌పీఎం ఉమాపతి అన్నారు. సోమవారం బాల్కొండలోని మహిళ సమాఖ్యలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సంస్థ ద్వారా ఈ సీజన్‌లో మక్కలను కొనుగోలు చేయాలన్నారు. హర్వెస్టర్‌కు రోజుకు 10 గంటల కంటే తక్కువ పనిగంటలు లేకుండా చూడలన్నారు. డీపీఎం మధుసూదన్, ఏపీఎం గంగాధర్ ఉన్నారు.

గెజిటెడ్ హెచ్‌ఎంల నియామకం

కమ్మర్‌పల్లి: మండలంలోని కమ్మర్‌పల్లి, ఉప్లూర్, హాసాకొత్తూర్, కోనాసముందర్, కోనాపూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు నియమితులైనట్లు ఎంఈవో ఆంధ్రయ్య తెలిపారు. ఉప్లూర్‌కు రాజన్న, కమ్మర్‌పల్లికి సాయన్న, హాసకొత్తూర్‌కు డీఎల్‌ఎస్ చారి, కోనాసముందర్‌కు మధుపాల్, కోనాపూర్‌కు రామ్‌ప్రసాద్ పదోన్నతిపై వచ్చినట్లు ఎంఈవో పేర్కొన్నారు.

ఇంటి నంబర్లపై విచారణ చేయాలి

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలో అక్రమంగా కేటాయించిన ఇంటి నంబర్లపై విచారణ చేయాలని పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కోలా వెంకటేష్ కోరారు. ఈ మేరకు పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్‌కు కాంగ్రెస్ నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. మీర్ మాజీద్, జిమ్మి రవి, రవికాంత్ రెడ్డి, బాల కిషన్, అబ్దుల్ ఫయీమ్, పెద్ద పోశెట్టి, హబీబ్, ప్రసాద్, ఉదయ్, అలీమ్, భగత్, అఖిల్ పాల్గొన్నారు.

అంకాపూర్‌ను సందర్శించిన జనగామ రైతులు

పెర్కిట్: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని జనగామ జిల్లా రైతులు సోమవారం సందర్శించారు. వరంగల్ నాబార్డు సంస్థ సహకారంతో స్పందన సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో జనగామకు చెందిన ఏరువాక రైతు ఉత్పత్తిదారుల సంఘం, జఫర్గఢ్ రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్లు, సభ్యులు అంకాపూర్‌ను సందర్శించారు. అంకాపూర్‌లో రైతులు వ్యవసాయంలో అనుసరిస్తున్న విధానాలను గురడి రెడ్డి కాపు సంఘం సభ్యుడు కేకే భాజన్నను అడిగి తెలుసుకున్నారు.

ఆలయ నిర్మాణం ప్రారంభం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని ప్రసిద్ధి గాంచిన నవనాథ సిద్ధులగుట్టపై క్షత్రీయ సమాజ్ ఆధ్వర్యంలో సోమవారం సహస్రార్జున ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని ఆలయ నిర్మాణ కన్వీనర్ డీకే రాజేష్ తెలిపారు. బారాడ్ గంగామోహన్, హజారి సతీష్, బోబిడే గంగకిషన్, అల్జాపూర్ వీరేంద్ర, జెస్సు శ్రీనివాస్, ఇంజినీర్ సాయి కృష్ణ ఉన్నారు.

సంఘ అభివృద్ధికి సహకరించాలి

కోటగిరి (రుద్రూర్): వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి సభ్యులందరు సహకరించాలని కోటగిరి సింగిల్ విండో ౘైర్మన్ కూచి సిద్దు కోరారు. కోటగిరి విండో మహాజన సభ సోమవారం ఏర్పాటు చేశారు. రైస్ మిల్ ఏర్పాటు చేయాలని, ధాన్యం ఆరబెట్టడానికి ప్లాట్‌ఫాం నిర్మించాలని తీర్మానించారు. సమావేశంలో విండో వైస్ చైర్మన్ గజేందర్, సర్పంచ్ పత్తి లక్ష్మణ్, పాలక వర్గ సభ్యులు, విండో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ప్రజలు గణేశ్ నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా జరుపుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, ఏసీపీ జగదీష్ చందర్ కోరారు. పట్టణంలోని గుండ్ల చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను సోమవారం వారు పరిశీలించారు. నిమజ్జనం రోజు మండపాల నిర్వాహకులు సహకరించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చవాన్, ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు, మున్సిపల్ డీఈ భూమేశ్వర్ ఉన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గ్రూప్ -1 పరీక్ష రద్దు

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే హైకోర్టు గ్రూప్-1 పరీక్షను రద్దు చేసిందని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటి నుంచి ఉద్యోగాల భర్తీ విషయంలో మోసపూరిత వైఖరి అవలంబిస్తుందన్నారు. నిఖిల్, సిద్ధార్థ, అనిల్, నితిన్, రణవీర్ పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమ్మె ప్రారంభం

కోటగిరి(రుద్రూర్)/రెంజల్/బోధన్‌రూరల్/ఎడపల్లి: డిమాండ్ల సాధన కోసం ఆశావర్కర్లు సమ్మె బాట పట్టారు. సోమవారం ఆయా మండల కేంద్రాల్లో తహసీల్ కార్యాలయాల ఎదుట నిరవధిక సమ్మెను ప్రారంభించారు. తమకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సెకండ్ ఏఎన్ఎంలుగా ప్రమోషన్ కల్పించాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. బోధన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్ గౌడ్ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ప్రభుత్వం పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించి హెల్త్ కార్డు ఇవ్వాలన్నారు.


కోటగిరిలో సమ్మె చేస్తున్న ఆశావర్కర్లు


బోధన్‌లో..


రెంజల్‌లో..


ఎడపల్లిలో..

సాగునీటికి ప్రాధాన్యం

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

రుద్రూర్: బాన్సువాడ నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగు నీరందించడానికి కృషి చేస్తున్నట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పోతంగల్ మండలం కొడిచర్లలో సోమవారం కుర్మ సంఘం కల్యాణ మండపం, పాఠశాల అదనపు తరగతి గదులు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఆయన ప్రారంభించారు. బారెడు పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో లక్షా 50వేల ఎకరాలకు సాగు నీరందించాలని లక్ష్యంగా ఎత్తి పోతల పథకాలు, చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. పోతంగల్ మండలంలో కొడిచర్ల వద్ద రూ.70 కోట్లు, సుంకిని వద్ద రూ.30 కోట్లు చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి మంజూరు చేసినట్లు వెల్లడించారు. కొడిచర్ల కుర్మ సంఘం ఫంక్షన్ హాల్ అదనపు పనులకు రూ.10లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులతో ముచ్చటించి పాఠశాలలో సౌకర్యాలు, విద్యా బోధన్ గురించి తెలుసుకున్నారు. బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, జెడ్పీటీసీ శంకర్ పటేల్, సర్పంచ్ పుష్పలత భీమన్న, వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్, బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి, హౌసింగ్ డిప్యూటీ డీఈ నాగేశ్వరరావ్, తహసీల్దార్ సాయిలు, ఎంపీడీవో మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులు

బాల్కొండ: బాల్కొండ కేజీబీవీ విద్యార్థులు జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో సత్తా చాటారు. అండర్ -12 విభాగంలో 400 మీటర్ల పందెంలో రిత్విక బంగారు పతకం, అండర్ -10 విభాగంలో జైశీల రజత పతకం, 50 మీటర్ల పరుగు పందెంలో సౌమ్య రజత పతకం సాధించారు. విద్యార్థులను సోమవారం పాఠశాలలో అభినందించారు. ఎస్‌వో భవాని, పీఈటీ స్రవంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాక్లూర్: ఆర్మూర్ మండలం మునిపల్లిలో జరిగిన క్రీడల్లో సత్తాచాటిన మండలంలోని దాస్‌నగర్ గురుకుల పాఠశాల విద్యార్థులను సోమవారం ప్రత్యేకాధికారి వేములపల్లి సంజీవ్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ సరిత, రజిత, సుమలత, అర్చనలు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఎస్‌వో, పీఈటీ

ప్రత్యేక పూజలు.. అన్నదానాలు




జానకంపేటలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా, శక్కర్‌నగర్‌లో అన్నదానం

సాక్షి, నెట్‌వర్క్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఉత్సవాల్లో భాగంగా మండపాల్లో కొలువుదీరిన గణపయ్యలకు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లో మండపాల నిర్వాహకులు ప్రజలకు అన్నదానం చేశారు. ఎడపల్లి మండలం జానకంపేటలో ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజిత యాదవ్ వినాయకులను దర్శించుకున్నారు.

కుంభమేళాకు హాజరు కావాలి



రుద్రూర్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో వచ్చే ఏడాది జనవరిలో జరిగే కుంభమేళా కార్యక్రమానికి హాజరుకావాలని హరిద్వార్‌కు చెందిన తపోనిధి నంద్‌గిరి ఆనంద్ అకాడ స్వామి పిలుపునిచ్చారు. రుద్రూర్‌లోని శ్రీవీరభద్ర స్వామి ఆలయాన్ని సోమవారం ఆయన సందర్శించి పూజలు చేశారు. రామాయణ, గీతాపారాయణం చేయాలని, సనాతన ధర్మాన్ని ఆచరించాలని ఉద్బోధించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మేక వేంకటేశ్వర రావు, అర్చకులు శివప్పా, బైండ్ల బాల్‌రాజ్, సూర్య కాంత్, శ్రీనివాస్, గంగాధర్ ఉన్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి



బోధన్‌టౌన్/మాక్లూర్/ఆర్మూర్‌టౌన్/పెర్కిట్: భారతీయ జనతా పార్టీ సిద్ధాంత కర్త పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ నాయకులు సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బోధన్‌లో బల్దియా పారిశుధ్య కార్మికులను బీజేపీ నాయకులు అడ్లూరి శ్రీనివాస్, నర్సింహారెడ్డి సన్మానించారు.

‘బాల్కొండ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా’

మోర్తాడ్: బాల్కొండ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై బహిరంగకు చర్చకు సిద్ధమా అని మంత్రి ప్రశాంత్ రెడ్డికి కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి సవాల్ విసిరారు. తొమ్మిది ఏళ్ల నుంచి అభివృద్ధి పనులపై ఉలుకు పలుకు లేని మంత్రికి ఎన్నికలు దగ్గర పడుతుండడంతో అభివృద్ధి గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. సోమవారం మోర్తాడ్‌లో ప్రజా నిలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొన్ని రోజులుగా నియోజకవర్గంలోని కుల సంఘాలను పిలుస్తూ ప్రొసీడింగులు ఇస్తూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. భీమ్‌గల్‌తో పాటు అనేకచోట్ల ఎన్నో అభివృద్ధి పనులకు వేసిన శిలాఫలకాలు వెక్కిరిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికలు రాగానే కుల సంఘాలను పిలిచి వారిని మధ్య పెట్టే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. ప్రొసీడింగులు ఇవ్వడం తప్పా ఎక్కడ కూడా పనులు ప్రారంభించలేదన్నారు. సెంట్రల్ లైటింగ్ పనుల్లో నాణ్యత లోపం తాండవిస్తుందన్నారు. చెక్ డ్యామ్‌ల నిర్మాణంతో కమీషన్లు దండుకోవడమే తప్పా రైతులకు జరిగింది ఏమీ లేదన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైన రైతులకు ఎందుకు పరిహారం జమ కాలేదని ప్రశ్నించారు.


మోర్తాడ్ మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

కాంగ్రెస్‌ను గెలిపిస్తే రూ.500కే సిలిండర్

వేల్పూర్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.500కే సిలిండర్ అందజేస్తామని కాంగ్రెస్ నాయకుడు సునీల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఆయన వేల్పూర్ మండలం మోతెలో పల్లె పల్లెకు, గుండె గుండెకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. తనను గెలిపిస్తే అవినీతి రహిత పాలన అందించి, నిజమైన అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పారు.

అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తాం

బోధన్‌టౌన్: బీఆర్ఎస్ పట్టణంలో సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని, బీజేపీ అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పట్టణ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటికి బీజేపీ కార్యాక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని 1, 19వ వార్డుల్లో పర్యటించారు. ప్రతీ ఇంటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. 9 ఏళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమి లేదని విమర్శించారు. జిల్లా కార్యదర్శి సుధాకర్‌చారీ, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాసిని వినోద్, బాలరాజు, గుంత గంగాధర్, వాసు, నర్సింలు పాల్గొన్నారు.


నీటిలో పడవలు వదులుతున్న బీజేపీ నాయకులు

మున్సిపల్ సమావేశం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అధ్యక్షత కొనసాగింది. చైర్‌పర్సన్ మాట్లాడుతూ 18 ఏజెండా అంశాలు, 8 సప్లమెంటరి అంశాలు మొత్తం 25 ఏజెండా అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించామన్నారు. ఒక ఏజెండా అంశాన్ని తీర్మానం చేయకుండా వాయిదా వేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్‌మున్ను, కమిషనర్ ప్రసాద్‌చౌహన్ పాల్గొన్నారు. మొక్కల అంశంలో రూ.40లక్షలు ఈత మొక్కలు నాటాలని ప్రవేశపెట్టిన అంశాన్ని ఏకగ్రీవంగా రద్దు చేయించినట్లు బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జీవీ నర్సింహారెడ్డి పేర్కొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

బోధన్/ఆర్మూర్‌టౌన్/వర్ని/రుద్రూర్: డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా సోమవారం వారు వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పట్టు చేనేతను అభివృద్ధి చేస్తాం

ఆర్మూర్‌టౌన్: పట్టు చేనేత సహకార సంఘాన్ని అభివృద్ధి చేస్తామని క్షత్రియ ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఖాందేష్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి పండిత్ ప్రేమ్ అన్నారు. పట్టణంలోని గోల్‌బంగ్లా వద్ద గల పట్టు చేనేత సహకార సంఘం చైర్మన్ డాక్టర్ పవార్ మోహన్ అధ్యక్షతన సోమవారం 50వ మహాజనసభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ సంఘ భవనం శిథిలావస్థలో ఉన్నందున ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మంజూరు చేసిన రూ.20 లక్షలతో టెండర్ ప్రక్రియను పూర్తి చేయించి కాంట్రాక్టు పనులు పూర్తి చేయడానికి కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. గణేశ్యామ్, పోహార్ రాజ్ కరణ్, పడాల్ గణేష్, దత్తాద్రి, గటడి కిషన్, సాత్‌పుతె శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిద్ధుల గుట్టపై పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ నిర్వహించారు. సభ్యులు సుమన్, పీసీ గంగారెడ్డి, గంగాకిషన్, లక్ష్మణ్, మల్లయ్య, మీనాచందు, అయ్యప్ప శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ్రా పద్ధతిలో ఇళ్ల కేటాయింపు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను సోమవారం డ్రా పద్ధతిన లబ్ధిదారులకు కేటాయించారు. రెవెన్యూ అధికారులు ఇదివరకే 64 మంది లబ్ధిదారులను రెండు విడతలుగా ఎంపిక చేశారు. రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం స్వామి సమక్షంలో డ్రా తీసి లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించారు. డీటీ భాస్కర్, ఆర్ఐ శరత్ పాల్గొన్నారు.

ధర్మయుద్ధ ర్యాలీకి తరలిన ముదిరాజ్‌లు



బోధన్: కామారెడ్డిలో సోమవారం నిర్వహించిన ధర్మయుద్ధం ర్యాలీకి సాలూర మండల ముదిరాజ్‌లు తరలివెళ్లారు. వారు మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులకు అన్ని రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘ ప్రతినిధులు భూమయ్య, రమేష్, సురేష్, పీరాజీ ఉన్నారు.

‘సత్యశోధక్’ ఆవిర్భావ దినోత్సవం



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలో సోమవారం మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే దంపతులు ప్రారంభించిన సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని అంబేడ్కర్ యువజన సంఘం, సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుంకరి విజయ్, ఆంజనేయులు, అజయ్, అనిల్, మేకల క్రాంతి, సారా సురేష్, అశోక్, కిషన్ పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌తో ఫోన్‌ఇన్



సీజనల్ వ్యాధులు విస్తరిస్తున్న నేపథ్యంలో ఆర్మూర్ పట్టణంలో పారిశుద్ధ్య సమస్య పరిష్కారంపై మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతతో మంగళవారం సాక్షి ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నాము. పట్టణ ప్రజలు మీ కాలనీల్లో నెలకొన్న సమస్యలపై ఫోన్ చేయొచ్చు.

తేది : 26-09-2023 (మంగళవారం)

సమయం: ఉదయం 11.30 గంటల నుంచి 12. 30గంటల వరకు..

ఫోన్ చేయాల్సిన నంబర్: **8712310541**

మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌ఇన్



సీజనల్ వ్యాధులు విస్తరిస్తున్న నేపథ్యంలో బోధన్ పట్టణంలో పారిశుద్ధ్య సమస్య పరిష్కారంపై మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌తో మంగళవారం సాక్షి ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నాము. పట్టణ ప్రజలు మీ కాలనీల్లో నెలకొన్న సమస్యలపై ఫోన్ చేయొచ్చు.

తేది : 26-09-2023 (మంగళవారం)

సమయం: ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు..

ఫోన్ చేయాల్సిన నంబర్: **8520945321**

అంబేడ్కర్ విగ్రహానికి వినతి



మాక్లూర్: గ్రూప్ 1 పరీక్ష రద్దు కావడంతో ప్రభుత్వ తీరుకు నిరసనగా బీజేవైఎం మండల కార్యదర్శి రాథోడ్ రాజశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం మాక్లూర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ అసమర్థతతోనే గ్రూప్ 1 రద్దు అయిందన్నారు. అభ్యర్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తూ వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. గంగోనే సంతోష్, గంగోనే వినోద్, శివలాల్, రవియాదవ్, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 -	అష్ట దిగ్బంధనం - 1.00; ఖుషి - 3.55 సప్త సాగరాలు దాటి - 7.20 7/జీ బృందావన కాలనీ - 10.25
స్క్రీన్-2 -	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి -10.00, 1.10, 4.20, 7.30, 10.40
స్క్రీన్-3 -	7/జీ బృందావన కాలనీ - 01.10 మట్టి కథ - 4.40; చీటర్ - 10.00 మార్క్ ఆంథోని - 6.50
స్క్రీన్-4 -	జవాన్(తెలుగు)- 11.00, 2.35, జవాన్(హిందీ)- 6.10, 9.45

సంక్షిప్తం

నిమజ్జనానికి ఏర్పాట్లు

రెంజల్: గణేశ్ నిమజ్జన ఏర్పాట్లకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కందకుర్తి జీపీ పాలకవర్గ సభ్యులు నిర్ణయించారు. సర్పంచ్ ఖలీంబేగ్ అధ్యక్షతన సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మండలంతో పాటు పక్క మండలం నుంచి కందకుర్తి గోదావరి నదిలో గణనాథులను నిమజ్జనానికి తీసుక వస్తారని, రోడ్లపై గుంతలు లేకుండా మొరం వేయించాలని సభ్యులు తీర్మానించారు.

గడప గడపకు ధర్మ సమాజ్‌పార్టీ

మాక్లూర్: మండల కేంద్రంలో సోమవారం ధర్మ సమాజ్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రేమ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర జనాభాలో అధిక శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వంలో వాటా దక్కటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు రమేష్, సాయన్న, గంగాధర్, భూమేష్, మహేష్, సాయి, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

కొనసాగిన కార్మికుల దీక్షలు

బోధన్: బకాయి వేతనాల కోసం బోధన్ ఎన్డీఎస్ఎల్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 52 వ రోజుకు చేరాయి. కార్మిక నాయకులు నాగేశ్వర్ రావు, ఫాయిుద్దీన్ దీక్షలో కూర్చున్నారు.

కోటపాటి జన్మదిన వేడుకలు

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో సోమవారం ప్రవాస భారతీయుల హక్కులు, సంక్షేమ వేదిక వ్యవస్థాపకుడు కోటపాటి నర్సింహనాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. డాక్టర్ మధుశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై కోటపాటి సేవా కార్యక్రమాలను అభినందించారు.

మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా తీర్మానం

బాల్కొండ: మంత్రి ప్రశాంత్‌రెడ్డికి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అండగా ఉంటామని బాల్కొండ మండల కేంద్రంలో నెహ్రూనగర్ కాలనీకి చెందిన మైనార్టీలు 132 మంది సోమవారం తీర్మానం చేశారు. తీర్మాన ప్రతిని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డికి అందజేశారు.

పోస్టర్ల ఆవిష్కరణ

మాక్లూర్: ముక్తార్‌పాషా వర్ధంతి సందర్భంగా సోమవారం మండలంలోని మాణిక్ బండార్ చౌరస్తా వద్ద ఐఎఫ్‌టీయు జిల్లా కార్యదర్శి దుడ్డు గంగాధర్ పోస్టర్లను ఆవిష్కరించారు. 30న వరంగల్‌లో జరిగే బహిరంగ సభకు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. శివరాజ్, నవీన్, సాయిలు, సుమన్ పాల్గొన్నారు.

నేడు సులేమాన్‌నగర్‌లో స్పీకర్ పర్యటన

రుద్రూర్: మండలంలోని సులేమాన్‌నగర్‌లో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం పర్యటిస్తారని సర్పంచ్ ఖాదర్ తెలిపారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే కోటగిరిలో స్పీకర్ పర్యటిస్తారని సర్పంచ్ పత్తి లక్ష్మణ్ తెలిపారు. చాకలి ఐలమ్మ విగ్రహవిష్కరణ చేస్తారని పేర్కొన్నారు.

మెండోరా మండలంలో మంత్రి..

బాల్కొండ: రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మంగళవారం మెండోరాతో పాటు, దూదిగాం, వెల్కటూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.